# సొంత కాళ్ళమీద....

పూనూరు గంగాధరరెడ్డి

ఇంటర్ పాసయిన రామారావు ఫస్టియర్ డిగ్రీలో చేరడానికి సీటు వస్తుందో రాదో ననే బాధతో గత వారం రోజులనుండీ నీరసంగా కాలేజి చుట్టూ తిరుగుతున్నాడు. ఏభై శాతం మార్కులు వచ్చినా సీటు రాలేదతనికి. ఆ వారం రోజులు రేపురా మాపురా అంటూ ఆఫీసు గుమ్మం ముందున్న ప్యూనులు చెప్పి పంపటమేగాని, ప్రిన్సిపాల్ గారు లోనికి వెళ్లేందుకు పర్మిషన్ అనుగ్రహించనేలేదు!

ఆఫీసు గదివద్ద జనం ఆదుర్దాగా నిశ్శబ్దంగా భయం భయంగా క్యూలో నిలబడి ఉన్నారు. ఒక పెద్దగది ఆఫీసు మేనేజరుది. ఇంకొక పెద్దగది యు. డి. సి; యల్. డి. సి; కాషియర్లది. దాన్ని ఆనుకొని కరెస్పాండెంట్ గది. దాని ప్రక్కనే ప్రిన్సిపాల్ గది.

ప్రిన్సిపాల్‌గారు మంచి ప్రిన్సిపుల్స్ ఉన్నవాడేగాని కమిటీ మెంబర్ల చేతిలో కీలు బొమ్మ! అందుచేతనే డొనేషన్లు లేకుండా ఎన్నిమార్కులు వచ్చినా ఆ కాలేజీలో సీటు ఇవ్వడంలేదు. యూనివర్సిటీ గ్రాంట్లు సద్వినియోగం అవుతూనే ఉన్నాయి మరి!

"రామారావు మంచి తెలివిగలవాడోయ్. అందుకే అతగాణ్ణి చదివించడం" ప్రక్కనున్న కో డైరెక్టరుతో చెబుతున్నాడు రామారావు చదువుకు సాయం చేస్తున్న ధనుంజయ గారు. డొనేషను, రికమండేషను లేకుండానే ఆ కాలేజీలో సీటు తెచ్చుకోవాలని రామారావు నిర్ణయం. అదే అతని పట్టుదల. చదవడానికి జీవించరాదు; జీవించడానికే చదవాలంటాడు రామారావు.

రామారావును ఆశ్చర్యపరచిన విషయ మేమిటంటే, రామారావు మేనేజరు గది కెదురుగా కూచొని మొదటిరోజున అప్లికేషనులో మార్కులు 'ఎంటర్' చేస్తున్నాడు. అంతలో ఒక పెద్దమనిషి ఆకుజోళ్లు టకటక లాడిస్తూ సరాసరి మేనేజరు గదిలోకి వెళ్లాడు. రామారావు తలెత్తి అటుకేసి చూసాడు. ఆ పెద్దమనిషి చేతిలో అప్లికేషను ఫారముంది. అప్లికేషన్ మేనేజరు చేతిలోపెట్టి మేనేజరు కెదురుగాకూచున్నాడతగాడు. వాళ్ల మాటలు రామారావుకు స్పష్టంగా వినిపిస్తున్నాయి. వాళ్లేం చేసేది యితనికి స్పష్టంగా కనిపిస్తుంది. మేనేజరుగారు మార్కులు చూస్తూ 'అత్తెసరు మార్కులతో పాసయిన బాపతన్నమాట,' అంటూ ఏదో సణుగుతున్నాడు. యువతలి పెద్దమనిషి, 'ఇంద, యీ మూడువందలు విరాళంగా తీసుకోండి' అన్నాడు. మేనేజరు అప్లికేషన్ తీసుకొని, కరెస్పాండెంట్ వద్దకు వెళ్లి, తిరిగి చిరునవ్వుతో తన గదికివెళ్లి లోపలున్న పెద్దమనిషితో "ప్యూన్ అప్లికేషన్ ఫారమ్ కాషియర్ వద్దకు తెచ్చాడు. మీరువెళ్లి ఫీజు చెల్లించండి" అన్నాడు. కామంటే కాన్దేముంది! సన్నగా యీల వేసుకుంటూ కాషియర్ వద్దకు సాగాడా పెద్దమనిషి.

మరి కొంచెం సేపటికి ఒక నల్లటి కారు వచ్చి ప్రిన్సిపాల్ గదికెదురుగా ఆగింది. అందులోనుంచి ఓ రెండుజడల అమ్మాయి, ఒక గ్లాస్కోపంచె కట్టుకున్నాయువ దిగి, సరాసరి ప్రిన్సిపాల్‌గారి గదిలోకి వెళ్లారు. రామారావు నిదానంగాలేచి ప్రిన్సిపాల్ గదివైపు వెళ్లాడు. తెరిచిఉన్న కిటికీలోనుంచి గదిలో మాటలన్నీ విన్పిస్తున్నాయి. కరస్పాండెంట్



దిప్పుడొచ్చాడోమరి ప్రిన్సిపాల్‌తో మాట్లాడు తున్నాడు. "ఈపాప... మన కమిటీమెంబరు కనకంగారి వేలువిడిచిన,... అదేలెండి! దగ్గర బంధువు' ఏదో బొటాబొటి మార్కులతో పాసయినా మంచి తెలివిగలపిల్ల. 'అడ్మిట్' అని వ్రాసేయండి." ప్రిన్సిపాల్‌గారు మారు మాట్లాడకుండా అడ్మిట్ అని వ్రాసినట్లు న్నాడు. వాళ్లు నవ్వుకుంటూ బయటికి వచ్చారు.

"చదువుకునేందుకు సీటురాదు. డొనేషన్లు లేకుండా, రికమండేషన్లు లేకుండా బ్రతకడం కష్టం." ఉసూరుమంటూ హుషారు చచ్చిపోయిన రామారావు చదికిల పడ్డాడు ప్రక్కనున్న బెంచీపైన.

ఒక పదినిమిషాల తరవాత ఉద్యోగాలకు యింటర్వ్యూ చేసే వాళ్లను పిలిచినట్లు ఒక్కొక్కళ్లనే పిలిపించసాగారు ప్రిన్సిపాలు గారు. 'అవసరాల అప్పారావు' ... అప్పారావు'... ప్యూన్ పెద్దగా పిలిచాడు. అప్పారావు అక్కడున్న వాళ్లందర్నీ ప్రక్కకు నెట్టుకుంటూ, లోనికెళ్లాడు.

ప్రిన్సిపాల్ ఏదో మాట్లాడుతున్నాడు. 'అవును...మీదిఫలాన వూరని చెప్పావుకాదు... మార్కులు చాలా తక్కువచ్చాయే! నీ మొగం చూస్తుంటే చదివేట్టు లేదే! ఎందుకైనా మంచిది, నువ్వొకసారి కరస్పాండెంట్‌గారి దగ్గరకు వెళ్లి రావటం ఆరోగ్యం ...ప్యూన్ అతగాణ్ణి కరస్పాండెంట్ గదిలోకి

## సొంత కాళ్ల మీద...

తీసికెళ్లాడు. రామారావు కాళ్లుయాంత్రికంగా కరస్పాండెంట్ గదివైపు నడిచాయి.

"కూర్చో...కూర్చో..." మగపెళ్లివారికి విడిదిల్లో ఆడపెళ్లివారు మర్యాద చేసినట్లు మర్యాద చేస్తూ అప్పారావును తన ఎదురుగా ఉన్న కుర్చీలో భుజం పట్టి కూచో పెట్టి, "కత్తిలాంటి కుర్రాడివోయ్...ఇంత చిన్న వయసులో యిన్ని మార్కులతో పాసయ్యావంటే మంచి తెలివిగల వాడివన్నమాట!" (అంతా బోగస్. అతనికి యీ మధ్యే రెండు దశాబ్దాల వయసు దాటింది. ఇది మూడోసారి అతను పదవతరగతి పరీక్షలకు అప్పియరవ్వటం) అని, మన కాలేజి చాలా బీద కాలేజి గ్రాంట్లు గట్రా సరిగా రావడంలేదు. ఏదో నీలాంటి కుర్రాళ్లు తలా ఒక వెయ్యి రూపాయలు చందా యిస్తే అటు మీ గొప్ప పెరుగుతుంది ఇటు మా పరువు దక్కుతుంది" అన్నాడు నాలుగు రోజుల క్రితమే వచ్చిన గ్రాంట్సు చెక్కు మార్చుకొచ్చిన కరెస్పాండెంట్.

"అమ్మో! వెయ్యి రూపాయలే...రెండు పాడిగేదలను కొనుక్కొని బ్రతకమంటాడు మా నాన్న. చదివినా ఉద్యోగాలా పాడా" అన్నాడప్పారావు.

'ఎంతమాట...నీ లాంటి యువకులే యిలా అంటే ఎలాగయ్యా? ఓ మూడు వందలు యివ్వాల్సిందే..." అన్నాడు కరస్పాండెంట్.

అప్పారావు మెత్తపడి జేబులో చెయ్యిపెట్టాడు. రామారావు చూస్తుండగనే అప్పారావు లాంటి అత్తెసరుమార్కులవాళ్లకు సీట్లు వచ్చేసాయి. ఇలా వరుసనే వారం రోజులు జరిగినా రేపు, రేపు అంటూ త్రిప్పడమే గాని, ప్రిన్సిపాల్ రామారావుకు సీటు యివ్వనే లేదు—

రామారావు ఆలోచిస్తున్నాడు. 'గవర్నమెంటు కాలేజీలో చేరదామనుకుంటే తనున్న ఊళ్లో ఆకాలేజీ లేదాయె. ధనుంజయ గారింటి వద్ద చిన్న చిన్న పనులందుకుంటూ వారి అండదండలతో చదువుతున్న తాను పొరుగూరు వెళ్లి గవర్నమెంటు కాలేజీలో చదవగలడా? ఎంత చదివినా చివరకు ఎవరో ఒకరిని ఆశ్రయించ వలసిందే కదా! వెధవ 'పేరసైట్' బ్రతుకులు... ఆలోచనలతో యిల్లు చేరాడు.

రామారావు తండ్రి మధ్య తరగతి కుటుంబీకుడు. రామారావు ఆయనకు రెండవ సంతానం. వాళ్ల సంసారం నడవలేక నడుస్తున్న నావ. వీళ్ల దూరపుబంధువైన ధనుంజయగారు రామారావు తనను కలుసుకొని వాళ్ల బాధలన్నీ చెప్పుకున్న మీదట విశాల హృదయంతో యితనిని ఇంటర్ వరకు చదివించాడు. ఆ పైన కూడా చదివిస్తానంటున్నాడు.

బొంబాయి వెళ్లి ఆ వేళే వచ్చిన, ధనుంజయ గారి వద్దకు రామారావు వెళ్లి కనిపించాడు.

'కాలేజీలో చేరావా?' అడిగాడాయన;

'చేర్చుకోలేదు' అంటూ జరిగిందంతా చెప్పాడు రామారావు. 'ఓ రెండు వందలు వాళ్లమొహాన పొయ్యకూడదూ ...' అన్నాడు ప్రక్కనే కూర్చున్న భార్యవైపు చూసి ధనుంజయ.

'నేనిక చదవదల్చుకోలేదండీ' అన్నాడు రామారావు.

'ఎందువల్లోయ్!' అడిగాడు ధనుంజయ.

'ఎంత చదివినా ఫలితమేముంది?' పలుకుబడి గల వాళ్లను ఆశ్రయించ వలసిందే గదా చివరకు, అందుకని మా కాలేజి దగ్గరలో ఉన్న డాబా అద్దెకిస్తారట. మా మిత్రులంతా కాంటీన్ పెట్టమంటున్నారు. పెడదామనుకుంటున్నాను!' అన్నాడు రామారావు.

వరుడికి కట్నం కింద కారొద్దట!! పెట్రోలు కావాలంటున్నారు!! మనకంత శక్తి లేదు - ప్రమీలా!!!



'సరేలే, నీ కాళ్లమీద నీవు నిలబడతానంటే నే నెందుకు కాదంటాను! ఇంద ఈ నాలుగు వందలు తీసుకెళ్లి కావలసిన ఏర్పాట్లు చేసికో...!' అంటూ రామారావు చేతికి డబ్బు ఇచ్చాడు. కళ్ల వెంట ఆనంద బాష్పాలు రాలుతుండగా చేతులు జోడించి ఆ దంపతుల కిద్దరకు నమస్కరించి బయటకు నడిచాడు రామారావు.

'కాలేజి స్టూడెంట్స్ క్యాంటీన్! పెద్ద బోర్డు అందరినీ ఆకర్షించింది. చాలా మంది రామారావు మిత్రులా కాలేజిలో ఉండటం వల్ల కాలేజి క్యాంటీన్ మూతపడి, రామారావు క్యాంటీన్ దిన దినాభివృద్ధి చెంద సాగింది. తన క్యాంటీన్‌లో 'ఈ దేశంలో యెవడికి వాడు స్వశక్తితో బ్రతకాలి! అన్న బోర్డులు నాలుగు నాలుగు వైపులా తగిలించాడు మూడేళ్లు గడిచాయి. రామారావు మంచితనం, కలుపుగోలు తనం, దీక్ష, స్వయం. సహాయం అతన్ని అందరికీ మంచివాడిగా చేసాయి. ఈ మూడేళ్లల్లోనే అతను బి. ఏ. పరీక్ష ప్రైవేటుగా కట్టి పాసయినాడు!

తన అన్నను క్యాంటీన్ దగ్గరఉంచి ధనుంజయగారి దగ్గరకు వెళ్లాడు రామారావు— కుశలప్రశ్నల తరువాత తాను బీడుపడి ఉన్న ధనుంజయగారి చేలో నేలబోరు వేయించి ప్రత్తి పండిస్తానని అడిగాడు. ధనుంజయ గారు సంతోషంగా అంగీకరించాడు.

క్యాంటీన్‌లో వచ్చిన లాభాల సాయంతో ధనుంజయ గారి చేలో నేలబోరు వేయించాడు రామారావు. తక్కువలోతులోనే నీరు పుష్కలంగా లభించింది. బీడునేల సస్యశ్యామలంగా తయారయింది. వరుసనే రెండు సంవత్సరాలు ప్రత్తి పండించి పాటుపడితే ఫలితం సాధ్యమన్నది రుజూచేశాడు. రామారావు బి.ఎ. అనిపించుకున్న తృప్తి తీరింది; ఉద్యోగాలకై పరుగెత్తకుండా, ప్రయోజకుడైన రైతు అనిపించుకున్న పేరు దక్కింది రామారావుకి అతని కిప్పుడు పెళ్లికొడుకుల మార్కెట్టులో గిరాకీ పెరిగింది.

FREE! ఉచితం!

# మన ఆరోగ్యం

ఇంచుమించు ప్రతీ వారపత్రిక, మాసపత్రికలల్లోను మన ఆరోగ్యం ఎలా కాపాడుకోవలెనో, ఆరోగ్య సూత్రాలను ఎలాగ పాటించవలెనో, వాటిని గూర్చి ఉచితమైన వైద్య సలహాలను ఇస్తూనే వుంటారు. ఆరోగ్యం గూర్చిన పత్రికలు, పుస్తకాలు కొల్లలుగా కనిపిస్తున్నాయి. ఆరోగ్యము గూర్చి ఎంతమంది ఎన్ని విధాలుగా బోధించినా, మంచి ఆరోగ్యవంతులుగా ఉండాలనుకొంటే, మంచి పుష్టికరమైన ఆహారము, విశ్రాంతి తగిన వ్యాయమము తప్పని సరిగా ఉండాలనేది నిర్వివాదాంశం. అయితే ఆరోగ్య సూత్రాలను ఎంతో జాగ్రత్తగా పాటించి తగిన శ్రద్ధ తీసుకొన్న కొంతమంది ఆరోగ్యం కుదుటబడదు.

మానవుల ఆత్మయ దుస్థితిని అతని అనారోగ్యానికి దగ్గిర సంబంధం ఉందని చాలామందికి తెలియదు. ఆత్మీయంగ కలిగే భయాలు, హృదయపు కత్తి కోతలు, తీరని వేదనలు, భవిష్యత్తు గూర్చిన భయాలు, పనికిమాలిన చింతలు, మానవుని ఆరోగ్యాన్ని ఎంతగా పాడు చేస్తున్నవో తెలుసుకొంటే చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఎంత ఆస్తిపాస్తులున్న, ఎంతమంది స్నేహితులున్న అనుభవించేందుకు ఆరోగ్యం కొదువుగా నున్న యెడల వాటివలన ఎక్కువ ప్రయోజనం ఉండదు.

వారం రోజులు కష్టించి పనిచేయుటకు ఎంత శక్తి వినియోగిస్తామో అంత శక్తి ఒక గంట కలత చెందుటవలన, లేక కోపగించుటవలన ఉపయోగంపడుతుందట. అణచుకోలేని అసూయ, ద్వేషంతో కూడిన ఈర్ష్య, ఒక్క క్షణం అనుభవించుట వలన విషం సేవించుట వలన కలిగే హానికన్న ఎక్కువ హాని మన ఆరోగ్యానికి అవి కలుగచేస్తాయిందట.

పట్టరాని కోపముతో పనివాని మీద విరచుకొనిపడి కొద్ది క్షణాలల్లోనే మరణించింది మా ఇంటగలావిడ. భవిష్యత్ భయాలతో చింతతో, భరింపరాని వేదనకు గురి యయ్యి, ఒక రాత్రిలో కడు భయంకరమైన చర్మ వ్యాధికి లోనైయింది నా స్నేహితురాలు, మనస్సులో ప్రశాంత హృదయములో ఆనందం, ఆత్మల్లో సంతృప్తి పరిపూర్ణమైన ఆరోగ్యానికి ఎంతో అవసరం, సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము, సాధుత్వం, మనో నెమ్మది, ప్రపంచములోనున్న ఖరీదైన నిద్రమాత్రలన్నిటికన్న ఎంతో విలువైనవి.

కొంతమంది నోరు విప్పితే వారికున్న భయాలు, సందేహాలు, పక్షపాతులు, అయిష్టాలు, అసమాధానాలు, గూర్చి ఎంతో కలతచెంది వాటిని గూర్చే మాట్లాడుతూ, ఎదుటివారి మనశ్శాంతిని, సంతృప్తిని విశ్వాసాన్ని కూడా చెదరగొట్టేస్తుంటారు. దేవుడనుగ్రహించిన ఆరోగ్యాన్ని అనుభవించాలన్న, మనశ్శక్తిని కాపాడుకొనవలెనన్న ఇటువంటి అవిశ్వాసులకు పిరికివారికి దూరంగ నివశించుట ఎంతైన అవసరం. ఆరోగ్య సూత్రము గూర్చి Bible ఏమని బోధిస్తుందో తెలుసా.

"దేవునియందు భయభక్తులు కలిగి చెడుతనము విడిచిపెట్టుము. అప్పుడు నీ దేహమునకు ఆరోగ్యము నీ ఎముకలకు సత్తువయు కలుగును.

- చదలవాడ చంద్రమతిదేవి.

June-1/HOPE/AMG

| ఉచితం | ఉచితం |
|---|---|
| మీ ఇంట్లో కూర్చుని బైబిల్ పరిశోధనమీద చక్కటి సర్టిఫికెట్ పొందాలన్నా, బైబిల్‌కి సంబంధించిన అందమైన విలువగల పుస్తములు కావాలన్నా ఒక కార్డుపై మీ అడ్రసు స్పష్టంగా వ్రాయండి. పోస్టుఖర్చులుకూడ మావే. HOPE. | ఇదీ అడ్రసు : **ఎస్. జాన్ డేవిడ్,** నిరీక్షణ, పోస్టుబాక్స్ నం : 12, **చిలకలూరిపేట,** (గుంటూరుజిల్లా) A.M.G. |

The Gospel Message Inserted by Mr. S. John David, Nireekshana Post Box No: 12, Chilakaluripet, Guntur Dt, Thr ugh M/s. Hope Advertis ng & Public Relat ons, Swamy Street, Gandhi agar, Vijayawada-3